క్లుప్తంగా

గణపతి నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి



ఏటూరునాగారం : మండలంలోని గణపతి విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఉత్సవ కమిటీల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై కృష్ణప్రసాద్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గజానన మండళ్ల నిర్వాహకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరేగింపు సమయంలో విగ్రహాలకు విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని, తదితర సూచనలు చేశారు.

'స్వచ్ఛతా హీ సేవా' ముమ్మరం



వాజేడు : మండలంలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. మురుగు నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేశారు. సైడ్ కాల్వల్లోని నీటిని తొలగించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విద్యర్థులకు కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

దోమల నివారణ మందు పిచికారీ



కన్నాయిగూడెం : మండలంలోని లక్ష్మీపురం, రాజన్నపేట గ్రామాల్లో వైద్యాధికారి డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అభినవ్ మాట్లాడారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ తదితరులు ఆల్గొన్నారు.

మండల స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



వెంకటాపురం(కె) : మండల స్థాయి క్రీడాపోటీలకు 6, 7వ తరగతుల విద్యార్థులను మంగళవారం ఎంపిక చేశారు. మండలంలోని కాఫెడ్ క్రీడా మైదానంలో మండలంలోని అన్ని పాఠశాలల నుంచి వచ్చిన 6, 7వ తరగతుల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి మండల స్థాయిలో క్రీడాపోటీలకు ఎంపిక చేశారు. మండల స్థాయిలో ప్రతిభ చాటే విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిడెం యామిలి, ఉపసర్పంచ్ ధనలక్ష్మి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం జీవీవీ.సత్యనారాయణ, పీటీలు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం (కె) : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని ఆలుబాక గ్రామ శివారులో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాజేడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను విచారించి సమాచారాన్ని తీసుకుని వదిలేశారు. తనిఖీలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

వాజేడు : మండలంలోని పాయబాటలు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

చిట్యాల: యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు బి.శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

ఏటూరునాగారం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలీయాబీ తెలిపారు. మండల కేంద్రంలోని చాకలివాడలో మంగళవారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి వలీయాబీ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. చాకలి ఐలమ్మను స్ఫూర్తిప్రదాతగా కీర్తించారు. కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, సందీప్, రమేష్, బండ రమేష్, వేణు, సాయి, రజక సంఘం అధ్యక్షుడు ముక్కెర లాలయ్య, పర్వతాల ఎల్లయ్య, కుమారస్వామి, పర్వతాల లాలయ్య, దయాకర్, నరేష్, కిరణ్, విక్రమ్, సుమన్, అన్వేష్, పద్మ, వాణి, వేణు, లింగాచారి పాల్గొన్నారు.



ఏటూరునాగారం : ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వలీయాబీ

తెలంగాణ తల్లి విగ్రహం వద్ద..

ఐలమ్మ చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, వలీబాబా, సర్దార్, ఖాజాపాషా, కిరణ్, చంద్రబాబు, బోజారావు, ప్రభాకర్, రాంబాబు, రామకృష్ణ, యాదగిరి, కొమురయ్య, రమేష్, చిన్ని పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి ఆ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లాలయ్య, రఘు, ఆయూబ్, సోమయ్య, సురేందర్, ఖలీల్, ఎల్లయ్య, రియాజ్, సులేమాన్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మంగపేట : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ నూతులకంటి ముకుందం, నాయకులు చల్లగురుగుల తిరుపతి, పుణ్యం నాగలక్ష్మి, రాధిక, సందీప్, లొంకరాజు, చిట్టిబాబు, చందు, సుధాకర్, రమణ, శంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మంగపేట : కేక్ కట్ చేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం : మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడాకుల సమ్మయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు రవి, అశోక్, నరేష్, సాంబయ్య, రమేష్, సాయి, నరేష్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి

ఎస్ఎస్ తాడ్వాయి : బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని ఏటూరునాగారం ఏడీఏ శ్రీధర్ రైతులకు చెప్పారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఓ పోరిక జయసింగ్ అధ్వర్యంలో తాడ్వాయి, కామారం, కొండపర్తి, నర్సింగాపూర్, పంబాపూర్, గంగారం, బంజర ఎల్లాపూర్ గ్రామాల రైతులతో పంట రుణమాఫీ, రుణాల రెన్యూవల్‌పై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. రైతులు పంట రుణ బకాయిలను చెల్లించి మళ్లీ పొందాలన్నారు. కెనరా బ్యాంకు మేనేజర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రుణాలు మాఫీ అయిన రైతులు పాస్‌బుక్‌తో బ్యాంక్ అధికారులను సంప్రదించాలని చెప్పారు. పంట రుణం మాఫీ పోగా మిగతా రుణానికి సంబంధించిన డబ్బులను ఖాతాలో జమ చేసుకోవాలని తెలిపారు. పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. పంట రుణాలు తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈఓ రవికుమార్ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీధర్

గుడుంబా స్థావరాలపై పోలీసు, ఎక్సైజ్ దాడులు



ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని రంగాపూర్‌లోని గుడుంబా స్థావరాలపై పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎస్సై ఓంకార్ యాదవ్, ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్, సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బంది దాడి చేసి గుడుంబా తయారీదారులు భూమిలో దాచిన డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి ఉపయోగించి బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా విక్రయదారులు, తయారీదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గుడుంబా విక్రయించినా, తయారు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మంగపేట : మండలంలోని బోరునర్సాపురం-తిమ్మంపేట గ్రామాల మధ్య ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో మండలంలోని కత్తిగూడెం గ్రామానికి చెందిన కొక్కూరి సంతోష్ గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సంతోష్ ద్విచక్ర వాహనంపై మంగపేట వైపు నుంచి కత్తిగూడెంకు వెళ్తుండగా ఉప్పల నర్సయ్య చెరువు నాగులమ్మ గుడి సమీపంలో అదుపు తప్పి ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధాన రోడ్డు పక్కన కింద పడిపోయాడు. స్థానికులు సమాచారం అందించడంతో 108 వాహనంలో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ములుగు రూరల్ : అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు



వెంకటాపురం (కె) : సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

ములుగు రూరల్ : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ విమర్శించారు. 16వ రోజు సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆ సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. అంగన్‌వాడీలు సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. అంగన్‌వాడీలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మరాణి, మోక్షరాణి, భాగ్యలక్ష్మి, సుమతి, పద్మావతి, కొమురమ్మ, రాజమ్మ, మానస, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ కార్మికుల సమ్మె

వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం నాయకులు మాట్లాడారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మీనా కుమారి, అరుణ కుమారి, భిక్షావతి, స్వరూప, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆశవర్కర్ల సమ్మె

కన్నాయిగూడెం : ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు ఆర్క పాపా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆశవర్కర్లు చేపట్టిన సమ్మెలో మంగళవారం పాపా మాట్లాడారు. ఆశవర్కర్లు రోగులకు నిరంతరం వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. తమకు శ్రమకు తగ్గ వేతనం లభించడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.18 వేల వేతనం చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో లక్ష్మి, నాగమణి, తులసి, కమల, వెంకటలక్ష్మి, పార్వతి, రాధ, స్వప్న, సబిత, రాజేశ్వరి, కోమల, శ్రీలత, తిరుమల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కన్నాయిగూడెం : సమ్మె చేస్తున్న ఆశవర్కర్లు

మంగపేట : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు సుజాత, నాగమణి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో విద్యార్థులకు పతకాలు



వాజేడు : మండల విద్యార్థులు తైక్వాండో పోటీలో పతకాలు సాధించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 20 కేజీల విభాగంలో ఎస్.ఉమాశంకర్ బంగారు, 30 కేజీల విభాగంలో పి.సీతారామచంద్రారెడ్డి కాంస్య పతకాలను సాధించారు. ఇద్దరికీ ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అనంతరావు, ఉపాధ్యాయులు స్వరూప్‌సింగ్, పీఈటీ రాజ్యలక్ష్మి, కోచ్ బాలాజీ పాల్గొన్నారు.

బీఎంఎస్‌లో చేరిక

భూపాలపల్లి అర్బన్: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)లో మంగళవారం ఏరియాలోని వివిధ సంఘాల 6వ గని కార్మికులు చేరారు. వారికి ఆ సంఘం కార్యాలయంలో ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. యూనియన్‌లో చేరిన వారిలో కార్మికులు మల్యాల కార్తీక్, పునీత్‌రావు, ప్రవీణ్, అనిల్, సాగర్, సుభాష్, అనిల్, శివ, డేవిడ్, శ్రావణ్, రమేష్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

మంగపేట : సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని అకినేపల్లి మల్లారం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వత్సవాయి శ్రీధర్ వర్మ తెలిపారు. అనారోగ్యం బారిన పడి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందిన ఆ గ్రామానికి చెందిన చెట్టిపల్లి రాముకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.25 లక్షల చెక్కును శ్రీధర్ వర్మ మంగళవారం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదలను ఆదుకునేలా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందిస్తోందని తెలిపారు. పేదలు ప్రభుతవం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ఇన్‌చార్జ్ రాజమళ్ల సుకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రూప భద్రయ్య, హేమాచల క్షేత్రం ట్రస్టు బోర్డు డైరెక్టర్ దొడ్డ సాంబశివరావు, సీనియర్ నాయకులు గంట భగీరథుడు, సాంబశివరావు, లింగమూర్తి, నరేష్, మనోజ్, రాజు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న శ్రీధర్‌వర్మ

లావణి పట్టాలపై రైతులకు రుణాలివ్వాలి

కాటారం: లావణి పట్టాలు కలిగిన రైతులకు బ్యాంకు అధికారులు పంట రుణాలివ్వాలని ప్రజాసంఘాల నాయకులు బెల్లంకొండ పోచయ్య, పీక కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లావణి పట్టాలపై రుణాలివ్వకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అనేక కొర్రీలతో బ్యాంక్ అధికారులు రుణాల మంజూరులో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు ఇసునం మహేందర్, అక్కల బాపు, బొబ్బిలి రాజయ్య, రమేష్ పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో తనిఖీ

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని తపాలా కార్యాలయాన్ని మంగళవారం ఆ శాఖ పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనంత రామ్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు తపాలా పొదుపు పథకాలు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ కృష్ణ, సంతోష్, బీపీఎంలు గణేష్, తిరుపతి, దశరథ్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'దళితబంధు' అందించాలి

మహదేవపూర్: అర్హులకు దళితబంధు పథకాన్ని అందించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఈమేరకు మండల కేంద్రంలో మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సమత సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శివరాజు, మాల మహానాడు నాయకులు మేర్గు పెద్ద సమ్మయ్య, నేతకాని సంఘం నాయకులు జనగాం సమ్మయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు దర్మయ్య, రవితేజ, మహిళలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ములుగు రూరల్: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మంగపేట : వైద్యం చేస్తున్న డాక్టర్ నిఖిల్‌కుమార్

ములుగు రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మల్లికార్జున్ కోరారు. మండలంలోని పంచోత్కుపల్లిలో రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో కలిసి రాష్ట్రీయ బాల స్వాస్థ్య కేంద్ర (ఆర్‌బీఎస్కే) వైద్యులు, సిబ్బంది మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున్ మాట్లాడారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వకుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దోమల వల్ల డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరం లక్షణాలు ఉంటే సమపంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత, సిబ్బంది మాదురి, సుభాషిణి, కేశాబాయి, సుజాత, హరినాథ, ఆశవర్కర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఆరోగ్య పరిరక్షణ

మంగపేట : అవగాహన పెంచుకోవడం ద్వారానే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలమని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని కత్తిగూడెంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 49 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ నిఖిల్‌కుమార్ మాట్లాడారు. కాచి చల్లార్చి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని, కలుషిత ఆహారాన్ని తినవద్దని, తదితర సూచనలు అందించారు. కార్యక్రమంలో జీపీ స్పెషల్ ఆఫీసర్ రాజు, పంచాయతీ కార్యదర్శి అజ్మత్, మెడికల్ క్యాంపు వైద్యాధికారి సుజాత, ఏఎన్‌ఎం రంజని, సోమలక్ష్మి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టండి



ఏటూరునాగారం : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సుమలత, వెంకటేశ్వర్లు



వెంకటాపురం (కె) : ఆరోగ్య మహిళ కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైద్యురాలు, సిబ్బంది

ఏటూరునాగారం : మహిళలు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి, వైద్యుడు మంకిడి వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మహిళలకు 8 రకాల ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. మహిళల్లో వచ్చే సమస్యలను వెంటనే గుర్తించాలని సూచించారు. అవసరమైన చికిత్స పొందాలని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా 8 రకాల పరీక్షలు చేయించడంతోపాటు చికిత్స, మందులు ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు సుమలత, ఎంపీహెచ్ఎస్ కమల, శ్రీలత, నగేష్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ 89 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే 32 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి రోగ నిర్ధారణ పరీక్షల కోసం ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం ఆరోగ్య మహిళ కరపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

వెంకటాపురం (కె) : పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణుల్లో రక్తహీనతను నివారించవచ్చని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌లో గర్భిణుల సమస్యలపై చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ మాట్లాడారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రసూతి సమయంలో రక్తహీనత సమస్య తలెత్తకుండా విటమిన్లు,ఐరాన్ టాబ్లెట్స్ తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆనంతరం గర్భిణులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాష్, సాయితేజ దిశ ప్రొటక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు పెనుమచ్చ మాధురి, సరిత, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.



పండ్లు అందజేస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

హామీలు నెరవేర్చకుంటే మళ్లీ సమ్మె

ఏటూరునాగారం : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మళ్లీ సమ్మె చేస్తామని సెకండ్ ఏఎన్‌ఎంలు సుగుణావతి, పావని, సుజాత స్పష్టం చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మంకిడి వెంకటేశ్వర్లులకు ఏఎన్‌ఎంలు వారి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. అనంతరం ఏఎన్‌ఎంలు మాట్లాడారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గత నెల 16 నుంచి ఈనెల 3 వరకు సమ్మె చేశామని చెప్పారు. రెగ్యులర్ చేస్తామని, ఇతర సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తామని, 15 రోజుల్లో పీఆర్సీ బకాయిలతోపాటు సమ్మె కాల వేతనాలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. అయినా ఇప్పటివరకు ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆందోళన వెలిబుచ్చారు. కమిటీ వేసి నెలరోజులు కావస్తున్నా ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అక్టోబర్ 5లోగా తమ సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సమ్మక్క, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు

వేతన బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం

వెంకటాపురం (కె) : రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతన బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీపీ చెరుకూరి సతీష్‌కుమార్‌కు మల్లికార్జునరావు ఆధ్వర్యంలోని బృందం మంగళవారం వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడారు. వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేల చొప్పున చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కట్ల రాజు, రాంబాబు, సమ్మక్క, తిరుపతమ్మ, నాగమ్మ, సీత తదితరులున్నారు.



వినతిపత్రం ఇస్తున్న మల్లికార్జునరావు, కార్మికులు